గిట్టుబాటు ధరపై చిత్తశుద్ధి కరవు

న్యూస్‌టుడే, ధర్మారం: ధర్మారం వ్యవసాయ మార్కెట్లో పత్తి కొనుగోళ్ల కోసం 2015లో ధర్మ కాంట ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయకపోవడంతో అది నిరుప యోగంగా ఉంటోంది. మరోవైపు ధర్మారంతో పాటు పరిసర మండలాల రైతులు పత్తిని ప్రైవేటు వ్యాపారులు అడిగిన ధరకు విక్రయించక తప్పడం లేదు. పదిహేనేళ్ల కిందటి వరకు ధర్మారంలో సీసీఐ ఆధ్వర్యంలో నిర్వహించిన కేంద్రాన్ని అగ్ని ప్రమాదం జరగడంతో రద్దు చేశారు. సరైన వస తులు లేవని తిరిగి మంజూరు చేయలేదు. అగ్ని ప్రమాదం తర్వాత సీసీఐ అధికారులు సూచించిన పనులన్నీ చేపట్టారు. అయితే పత్తిని నిల్వ చేసే గోదాం ఉంటే కొనుగోలు కేంద్రం మంజూరయ్యే ఆస్కారముంది. ఈ విషయమై ఏఎంసీ ఛైర్మన్ లావుడ్యా రూప్లానాయక్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా గోదాం నిర్మాణానికి రూ.2.50 కోట్లు మంజూరు చేయాలని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో కలిసి ఇటీవల ఉపముఖ్యమంత్రి భట్టి విక్ర మార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావులను కలిసి కోరామని వివరించారు. పత్తి కొను గోలు కేంద్రం ఏర్పాటుకు చొరవ చూపుతున్నామని వివరించారు.

2015లో ఏర్పాటు చేసిన ధర్మకాంట

నేడు చలో కలెక్టరేట్

మంథని, న్యూస్‌టుడే: మున్సిపల్ కార్మికుల సమస్యలపై సోమవారం తలపెట్టిన చలో కలెక్టరేట్ కార్యక్రమా నికి పెద్దసంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యంరావు పిలుపునిచ్చారు. మంథనిలో ఆదివారం నిర్వహించిన మున్సిపల్ కార్మిక సంఘం సాధారణ సమావేశంలో ఆయన మాట్లాడారు. మున్సిపల్ కార్మికులను క్రమబద్ధీకరించి, కనీస వేతనం రూ.26 వేలు చెల్లించా లని డిమాండ్ చేశారు. జిల్లా కమిటీ సభ్యుడు గజేశ్ చందు, రాజయ్య, గట్టయ్య, రాజయ్యలు పాల్గొన్నారు.

అక్రమాల గుట్టు తేలేనా!

● చెక్‌డ్యాంల నిర్మాణ లోపాలపై విజిలెన్స్ దృష్టి

ఈనాడు, పెద్దపల్లి

రాష్ట్రంలో చెక్‌డ్యాం నిర్మాణాల ప్రగతి, వెచ్చించిన నిధులపై ఇటీవల హైదరాబాద్‌లో నీటిపారుదల శాఖ అధికారులతో సమీక్షించారు. నిర్మాణాల్లో చోటుచే సుకున్న అక్రమాలపై విచారణ జరపాలని ఆదేశాలి చ్చారు.

ఉమ్మడి కరీంనగర్ జిల్లావ్యాప్తంగా మానేరు, హుస్సేన్‌మియా వాగులపై నాలుగేళ్ల కిందట రూ. వందల కోట్లు వెచ్చించిన చేపట్టిన నిర్మాణాలు నత్తన డకన సాగుతున్నాయి. పనులు జరుగుతుండగానే వచ్చిన వరదలకు చాలా చోట్ల నామరూపాల్లేకుండా కొట్టుకుపోయాయి. ఒక్కో చెక్‌డ్యాంకు రూ.50 లక్షల నుంచి రూ.20 కోట్ల వరకు వెచ్చించారు. నాణ్యత, పర్యవేక్షణ లోపాలు వెలుగు చూస్తున్నా చర్యలు తీసు కోకపోవడం విమర్శలకు తావిస్తోంది.

రెండు విడతల్లో 72 చెక్‌డ్యాంలు

2019-20లో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 114 నిర్మాణా లకు ప్రతిపాదనలు పంపారు. రెండు విడతల్లో 72 చెక్‌డ్యాంలు మంజూరు చేశారు. కరీంనగర్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల జిల్లాల పరిధిలోని 52 ఆనకట్టలకు రూ.237.95 కోట్లు చెల్లించారు. జగిత్యాలలో రూ.20 కోట్ల అంచనాతో జగిత్యాల, ధర్మపురి నియోజకవర్గాల్లో అయిదు చెక్‌డ్యాం పనులు మాత్రమే ప్రారంభం కాగా అవి కూడా అసంపూర్తిగా ఉన్నాయి.

ప్రవాహానికి అడ్డుకట్ట వేసి భూగర్భ జలాలు పెంచాలన్న ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది.. నాసిరకం పనులతో ఆనకట్టలు తెగి నీళ్లతో పాటే నిధులూ కొట్టుకుపో తున్నాయి.. అనుభవం లేని గుత్తేదారులకు పనులు అప్పగిస్తున్న అధికారులు పర్యవేక్షణ బాధ్యతలు మరవడంతో కలకాలం ఉండాల్సిన నిర్మాణాలు మూణ్నాళ్ల ముచ్చటగా మారుతున్నాయి.. గత ప్రభుత్వ హయాంలో జరిగిన పనులపై విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పరిశీలనకు సిద్ధమవుతుండటం సర్వత్రా చర్చనీయాంశమైంది..

ఎల్లడెలా నిర్మాణ లోపాలు

● ఆనకట్టల నిర్మాణంలో భాగంగా ముందుగా వాగులో గట్టిదనం వచ్చేవరకు ఇసుకను తోడి బెడ్ నిర్మించాలి. ఇందుకు భిన్నంగా ఇసుక పైనే నిర్మించడంతో ఆప్రాన్‌లు, రిటైనింగ్ వాల్స్, అబా ర్డ్‌మెంట్ భాగాలు వరద ఉద్ధృతికి దెబ్బతింటున్నాయి.

● వరద ప్రవాహాన్ని అంచనా వేసేందుకు ప్రత్యేక సాంకేతికత అందుబాటులో లేకపోగా ఇసుక మేటలు పూర్తిగా తొలగించకుండానే ఆన కట్టలు నిర్మించడంతో దెబ్బతింటున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● నిర్మాణ అనుభవం లేని గుత్తేదార్లకు ఒకటి కంటే ఎక్కువ నిర్మాణాలు కట్టబెట్టడంతో నాణ్యత ప్రశ్నార్థ కంగా మారింది.

జమ్మికుంట మండలం విలాసాగర్ వద్ద కొట్టుకుపోయిన చెక్‌డ్యాం

అసలే ఆలస్యం.. ఆపై అర్ధంతరం

● సుల్తానాబాద్ మండలం గట్టెపల్లిలో రూ.4 కోట్లతో చేపట్టిన చెక్‌డ్యాం పనులు పునాది దశలోనే ఉన్నాయి. ఏడాది ఆలస్యంగా పనులు ప్రారంభించిన గుత్తేదారు సిమెంటు, కాంక్రీటు ధరలు పెరగడంతో మధ్యలోనే వదిలేశారు.

● 2016లో జమ్మికుంట మండలం విలాసాగర్ వద్ద మానేరులో రూ.10 కోట్లతో చెక్‌డ్యాం నిర్మించారు. 800 మీటర్ల పొడవున్న నిర్మాణంలో దాదాపు 120 మీటర్ల మేర కూలింది. మరమ్మతులకు రూ.4 కోట్ల వరకు అవుతాయని అంచనా వేశారు.

● వీణవంక మండలం మల్లారెడ్డిపల్లి, ఓదెల మండలం కనగర్తి గ్రామాల మధ్య చెక్‌డ్యాం కట్టక గండి పడింది. తాత్కాలికంగా మరమ్మతు చేసి లీకే జీలను అరికట్టారు. ఓదెల మండలం రూపునారాయ ణపేట, కనగర్తి చెక్‌డ్యాంలకు గతంలో వరదతో నష్టాలు సంభవించాయి.

● వేములవాడ మండలం మల్లారంలో మూలవా గుపై రూ.4.17 కోట్లతో చెక్‌డ్యాం నిర్మించారు. 80 శాతం పనులు పూర్తి కాగా గుత్తేదారుకు రూ. 3.18 కోట్ల వరకు చెల్లించారు. ఇటీవలి వర్షాలకు కట్ట మీదుగా వరద పారడంతో సమీప ఇళ్లకు ముంపు ముప్పు పొంచి ఉందని డిటోనేటర్లతో పేల్చివేశారు.

ముంచిన వరదతో రూ.30 లక్షల నష్టం

మంథని మండలం అడవిసోమన్‌పల్లి వద్ద మానేరులో రూ.16 కోట్లతో నిర్మించిన చెక్‌డ్యాం గతేడాది భారీ వర్షాలకు కొట్టుకుపోయింది. రిటైనిం గ్‌వాల్స్ దెబ్బతిని పరీవాహక పొలాలు నీట మునిగాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని 28 ప్రధాన చెరువులతో పాటు మోరంచ, చలి, పెద్దవాగుల నుంచి భారీగా వరద చేరడంతో ఈ ఆనకట్ట దెబ్బతింది. దిగువ మానేరు జలాశయం గేట్లు ఎత్తి నీటిని వదలడంతో ఉద్ధృతి మరింత పెరిగింది. ఆనకట్టకు రూ.30 లక్షల వరకు నష్టం వాటిల్లిందని అధికారులు తెలిపారు. 2023 జులై 27న వచ్చిన వర

మంథని మండలం అడవిసోమన్‌పల్లి వద్ద ఇలా..

దకు చిన్నఓదాల వద్ద నిర్మించిన చెక్‌డ్యాం మధ్యలో గండి పడింది.

మేలిమి గౌరమ్మా.. వెళ్లి రావమ్మా!

మంథని పట్టణంలో బొడ్డెమ్మ శోభాయాత్రను ఆదివారం రాత్రి మునంగా నిర్వహించారు. ఎనిమిది రోజులుగా మహిళలు, చిన్నారులు భక్తిశ్రద్ధలతో బొడ్డెమ్మ వేడుకలను నిర్వహించారు. 9వ రోజు రంగు రంగుల పుష్పాలతో బొడ్డెమ్మను ప్రత్యేకంగా అలంకరించి.. ఆడిపాడి కొలిచారు. సాయంత్రం తోపుడు బండ్లను అలంకరించి పుర వీధుల గుండా బొడ్డెమ్మ శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం చెరువులో నిమజ్జనం చేశారు. -న్యూస్‌టుడే, మంథని గ్రామీణం

పదవీ విరమణ శుభాకాంక్షలు
పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగములో వివిధ హోదాలలో పనిచేసి, నేడు పదవీ విరమణ చేయుచున్న మా ఆత్మీయులకు పదవీ విరమణ శుభాకాంక్షలు.
వారి భావిజీవితము సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో గడవాలని కోరుకుంటూ,,
Er. B.Srinivas-Lalitha
Technical Officer
P.Raj Division, Peddapally
Cell: 96761 01900
Er. Mohd.Shoib Ul Haque
Junior Technical Officer
P.Raj Sub Division, Jagtial
Cell: 9440382496
Panchayat Raj Diploma Engineer's Association
కరీంనగర్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల మరియు పెద్దపల్లి జిల్లాలు


పదవీ విరమణ శుభాకాంక్షలు
గత 41 సం।లు ఉపాధ్యాయురాలుగా విధి నిర్వహణలో అంకితభావంతో పని చేసి అందరి మన్ననలు పొంది నేడు (30-09-2024) పదవీ విరమణ చేయుచున్న మా అమ్మ
శ్రీమతి పెండాల పద్మలత గారికి
ప్రేమపూర్వక శుభాకాంక్షలు.
కూతుర్లు-అల్లుండ్లు:
గాండ్ల అశ్విని-శ్రీకాంత్
B.Tech M.Sc (USA)
పిడి ప్రీతమ్-డా। గంగాధర్‌రెడ్డి
M.C.A M.Ch(Paediatric Surgeon)
మనుమరాండ్లు, మనుమడు:
గాండ్ల శ్రీహిత, ఆద్య
పిడి పాయిశ్రీత్, సాయితాధ్య
శ్రీమతి, శ్రీ పెండాల పద్మలత-బోనగిరి శ్రీధర్‌రావు
SGT, MP, UPS, చేగుర్తి, మం., జి। కరీంనగర్ Rtd. GHM

పదవీ విరమణ శుభాకాంక్షలు
గత 33 సం।లుగా పంచాయతీరాజ్ శాఖలో అంకితభావంతో పనిచేసి అందరి మన్ననలు పొంది నేడు పదవీ విరమణ చేయుచున్న
బి.శ్రీనివాస్ గారికి
ఇవే మా హార్దిక శుభాకాంక్షలు.
శ్రీమతి, శ్రీ బి.శ్రీనివాస్-లలిత గార్లు
టెక్నికల్ ఆఫీసర్, O/o. DPRE PIU Peddapally
బి.గిరిష్‌బాబు, జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీర్ మరియు సిబ్బంది, పెద్దపల్లి
సిహెచ్.శంకరయ్య, ఉప కార్యనిర్వాహక ఇంజనీర్ మరియు సబ్‌డివిజన్ సిబ్బంది, పెద్దపల్లి
కె.దేవేందర్, Dy. EE, PRSD, సుల్తానాబాద్ మరియు సిబ్బంది
కె.రాజమౌళి, Dy. EE, PRSD, జూలపల్లి మరియు సిబ్బంది
కె.నవీన్‌కుమార్, Dy. EE, PRSD, మంథని మరియు సిబ్బంది
ఆర్.అప్పలనాయుడు, Dy. EE, PRSD, రామగుండం మరియు సిబ్బంది

ఎన్టీపీసీ ఔదార్యం.. ఆసుపత్రి నిర్లక్ష్యం

రోగులకు మెరుగైన సేవ లందించాలనే లక్ష్యంతో రామ గుండం ఎన్టీపీసీ యాజమాన్యం అత్యాధునిక వస తులు కలిగిన అంబులెన్సును సమకూర్చగా.. నిర్వహణలో ఆసుపత్రి వర్గాల నిర్లక్ష్యానికి నిదర్శ నమే తలుపులు లేని, సీట్లు చిరిగిన ఈ అంబులెన్సు. గోదావరిఖని లోని ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలందించేం దుకు అవసరమైన సామగ్రితో అంబులెన్సును సమకూర్చారు. అయితే రోగులకు సేవలందించాల్సిందిపోయి.. ఆక్సిజన్ సిలిండర్లను తరలించేందుకు వినియోగిస్తుండడం గమనార్హం.

- న్యూస్‌టుడే, గోదావరిఖని పట్టణం

సింగరేణి సిగలో మరో విద్యుత్తు కేంద్రం

800 మెగావాట్ల ప్లాంటుకు ప్రణాళికలు

న్యూస్‌టుడే, గోదావరిఖని

మరో 800 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి కేంద్రాన్ని నిర్మించాలని సింగరేణి ప్రణాళి కలు రచించుకుంటుంది. ఇప్పటికే ఆ పనులు టెండర్ దశకు చేరుకున్నాయి. పదేళ్ల క్రితం మంచిర్యాల జిల్లా జైపూర్ వద్ద ఎన్టీపీపీలో మరో ప్లాంటు నిర్మాణానికి ప్రతిపాదనలు చేసినా పురోగతి లేకుండా పోయింది. ఇటీవల దానిపై తిరిగి పనులు చేపట్టేందుకు యాజ మాన్యం ప్రణాళికలు చేసింది. దానికి సంబంధిం చిన నివేదికలు తయారు చేసిన సింగరేణి.. త్వరలో టెండరు పిలిచేందుకు ఏర్పాట్లు చేసింది. త్వరలోనే శంకుస్థాపన చేసేందుకు కూడా ప్రజాప్రతినిధుల సమయం కోసం వేచి చూస్తుంది. ఇదివరకే జైపూర్ వద్ద 1200 మెగా వాట్ల రెండు యూనిట్లను నిర్మించింది.

రూ.10 వేల కోట్ల వ్యయంతో..

రెండో దశలో నిర్మించే 800 మెగావాట్ల థర్మల్ విద్యుత్తు కేంద్ర నిర్మాణానికి సంబంధించిన అంచ నాలు తయారు చేసింది. సుమారు రూ.10 వేల కోట్ల వ్యయంతో పనులు చేపట్టాలని భావి స్తుంది. అయితే పనులను ఎవరికి అప్ప గించాలనే సమాలోచనలో ఉంది. మొదటి దశలో నిర్మించిన రెండు యూనిట్లకు సంబంధించిన పనులను బీహెచ్ఈఎల్‌కు అప్పగించింది. అవసరమైన బొగ్గు, నీరు అందుబాటులోనే ఉండటంతో.. పనులు పూర్తికాగానే ఉత్పత్తికి ఇబ్బంది ఉండదన్న అభిప్రాయం ఉంది. సింగరేణి గనుల నుంచి వెలికి తీసిన బొగ్గును ఈ ప్లాంటుకు వినియోగించుకునే అవకాశం ఉంది. ఇప్పటికే సింగరేణి విద్యుత్తు కేంద్రం కోసం శెట్టిపల్లి

3,500 మెగావాట్ల ఉత్పత్తిపై దృష్టి

థర్మల్ విద్యుత్తు కేంద్రాలతోపాటు సోలార్ విద్యుత్తు ఉత్పత్తి కేంద్రాలను సింగ రేణి నిర్మించింది. రెండు కేంద్రాల ద్వారా 1200 మెగావాట్లను విద్యుత్తు ఉత్పత్తి చేస్తున్న సింగరేణి.. 278 మెగావాట్ల సోలార్ విద్యుత్తును ఉత్పత్తి చేస్తోంది. వీటి కితోడు మరో 800 మెగావాట్ల థర్మల్ విద్యుత్తు కేంద్రం నిర్మాణానికి సిద్ధమైన

సింగరేణి థర్మల్ విద్యుత్తు కేంద్రం

వద్ద నిర్మించిన జలాశయం నుంచి నీటిని తీసుకొనే వెసులుబాటు ఉంది.

సింగరేణి.. మరో 500 మెగావాట్ల హైడ్రో విద్యుత్తు కేంద్రం నిర్మాణానికి ప్రతిపాదనలు చేశారు. వీటితోపాటు జలాశయాలపై 500 మెగావాట్ల సోలార్ విద్యుత్తు కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు తయారు చేశారు. మొత్తంగా 3,500 మెగా వాట్ల విద్యుత్తును ఉత్పత్తి చేయనుంది. రాష్ట్ర విద్యుత్తు అవసరాలు తీర్చే దిశగా సింగరేణి ప్రణాళికలు చేసుకుంటుంది.

దారిపైకి కొమ్మలు

మంథని-గోదావరిఖని ప్రధాన రహదారిపై నాగారం-గుంజపడుగు గ్రామాల మధ్య నాగారం ఉపకేంద్రం సమీపంలో కల్వర్టుపై ఇటీ వల గాలి దుమారానికి ఓ వృక్షం కూలిపోయింది. దాన్ని తొలగిం చకపోవడంతో కొమ్మలు రహదారిపై వచ్చాయి. ఈ మార్గంలో నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. వాహనదా రులు కల్వర్టు సమీపంలోకి ఆకస్మాత్తుగా బ్రేకులు వేయాల్సి వస్తోంది. భారీ వాహనాలు ఎదురెదురుగా ఒకేసారి వస్తుండటంతో అంతరాయం ఏర్పడుతోంది. **-న్యూస్‌టుడే, మంథని గ్రామీణం**

రూ.కోటి నిధులు.. కొట్టుకుపోయాయి

సుల్తానాబాద్ మండల కేంద్రం నుంచి ఎలిగేడు మండలం ర్యాకల్‌దేవ్‌పల్లికి వెళ్లే రహదారిని రూ.కోటి నిధులతో నాలుగేళ్ల క్రితం నిర్మించారు. ర్యాకల్‌దేవ్‌పల్లి చెరువు మత్తడికి వరద వచ్చే స్థలంలో లోలెవల్ వంతెన నిర్మించగా.. ఏటా రహదారి కొట్టుకుపోతోంది. దీంతో గ్రామస్థులు సుల్తానాబాద్‌కు రాకపో కలు సాగించే క్రమంలో సుగ్గంపల్లి మీదుగా 5 కి.మీ అదనంగా తిరిగి వెళ్లాల్సి వస్తోంది. గత మూడేళ్లుగా ఇదే పరిస్థితి. మరోవైపు నీరుకుళ్లనుంచి కరీంనగర్ జిల్లా మానకొం డూర్ మండలానికి వెళ్లే రహదారి ఏటా వరదలకు కొట్టుకుపోయి కోతకు గురవు తోంది.

-న్యూస్‌టుడే, సుల్తానాబాద్

కొట్టుకుపోయిన సుల్తానాబాద్-ర్యాకల్‌దేవ్‌పల్లికి రోడ్డు

నీరుకుళ్లలో కోతకు గురైన రహదారి

మొదటి స్థలం: తుప్పు వదుతున్న పిల్లర్లు

రెండో స్థలం: పునాదులకే సరి

పెద్ద పంచాయతీ.. భవన నిర్మాణమేదీ!

ధర్మారం మండలం నందిమేడారం పంచా యతీ భవన నిర్మాణానికి ఉపాధిహామీలో పదేళ్ల కిందట రూ.16 లక్షలు మంజూరయ్యాయి. ఆరే ళ్లక్రితం పనులు ప్రారంభించారు. రూ.6 లక్ష లకు పైగా వెచ్చించి పిల్లర్ల వరకు పనులు చేసి ఆపేశారు. పంచాయతీ భవనం డిజైన్ మారిం దని, తిరిగి కొత్తగా నిర్మించాలని గతేడాది రూ. 20 లక్షలు మంజూరు చేశారు. పిల్లర్ల ఇనుప చువ్వలు తుప్పు పడుతున్నాయి. మరోసారి ఉపాధిహామీలో రూ.20 లక్షలు మంజూరు చేసి గత ఆగస్టులో భూమిపూజ చేయగా పాత పిల్ల ర్లకు సమీపంలోనే మరో చోట పునాది తవ్వారు. ఏడాది దాటినా ఇప్పటికీ అతీగతీ లేదు. పాత భవనంలోనే పంచాయతీ కార్యా లయం కొనసాగుతోంది. పాత నిర్మాణం అర్ధం తరంగా నిలిచిపోగా, తర్వాత పునాదులు తీసి పనులు చేపట్టకపోవడంతో నిధులు మురిగి పోయే ఆస్కారముంది. నిధులు అలాగే ఉన్నాయని, సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని ఎంపీపీ రమేశ్ తెలిపారు.

-న్యూస్‌టుడే, ధర్మారం

పదవీ విరమణ శుభాకాంక్షలు
37 వసంతాలుగా సాగునీటి పారుదల శాఖలో ఎన్నో ప్రాజెక్టుల నిర్మాణంలో పాలుపంచుకొని అత్యుత్తమ సేవలందించి అందరి మన్ననలు పొంది మా ఉన్నతికి అహర్నిశలు శ్రమించిన
మా నాన్న శ్రీ ముస్త్యాల కరుణాకర్
సూపరింటెండింగ్ ఇంజనీర్ (SE) గారు
నేడు పదవీ విరమణ చేయుచున్న శుభసందర్భంగా
వారి భావిజీవితం ఆయురారోగ్యాలతో,
సుఖసంతోషాలతో గడవాలని భగవంతున్ని ప్రార్థిస్తూ...
శ్రీమతి, శ్రీ ముస్త్యాల కరుణాకర్-నిర్మల గార్లు
సూపరింటెండింగ్ ఇంజనీర్, ఇరిగేషన్ సర్కిల్, రామగుండం
కూతుర్లు-అల్లుండ్లు:
డా। ముక్కా మౌనిక-డా। శరత్‌బాబు
మనుమలు: శ్రీవాత్సవ్ కార్తికేయ, సాయిశివాన్ష్
శ్రీ కార్తికేయ హాస్పిటల్, జమ్మికుంట
గుడిపాటి షాలిని-ఆదిత్య
Software Engineers, USA
మనుమరాలు: అక్షర
చీకటిమళ్ల లక్ష్మీప్రసన్న-వంశీకృష్ణ
Software Engineers, USA

పదవీ విరమణ శుభాకాంక్షలు
గత 35 సం।। 2 నెలలుగా పోలీస్ శాఖలో వివిధ హోదాలలో అత్యుత్తమ సేవలందించి అందరి మన్ననలు పొంది ASIగా నేడు (30-09-2024) పదవీ విరమణ చేయుచున్న మా నాన్న గారైన
శ్రీ మ్యాకల లక్ష్మయ్య గారికి
మా పదవీ విరమణ శుభాకాంక్షలు.
వారి భావిజీవితం ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో గడపాలని కోరుకుంటూ
శ్రీమతి, శ్రీ మ్యాకల లక్ష్మయ్య-కమల గార్లు
Asst. Sub Inspector of Police
కొత్తపల్లి పోలీస్‌స్టేషన్, జి। కరీంనగర్
కుమారుడు-కోడలు:
మ్యాకల నవనీత్-చైతన్య
కూతురు-అల్లుడు:
దావు నవ్యశ్వేత-మురళీధర్
మనుమరాలు: దావు దీధితి
Eenadu, KNR-8008709950

(c) eenadu

రహదారి పనులు పూర్తి చేయిస్తా

డ్రైవింగ్ ట్రాక్‌పై ప్రత్యేక దృష్టి ■ కొత్త జిల్లాలకు ఆర్‌టీపీ భవనాలు ■ రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్

న్యూస్‌టుడే, కరీంనగర్ పట్టణం

? కరీంనగర్‌లోని కోతిరాంపూర్ నుంచి కట్టరాంపూర్ మీదుగా భగత్‌నగర్, దోజీవాడ, గణేశ్‌నగర్, కలెక్టరేట్‌కు వెళ్లేందుకు కట్టరాంపూర్-కోతిరాంపూర్ రహదారి అనువుగా ఉంటుంది. ఈ రోడ్డు పనులు రెండు కిలోమీటర్లు మేర ఉండగా సగంలో వదిలేశారు. ఎప్పటిలోగా పూర్తి చేయిస్తారు

✓ ఈ రహదారికి సంబంధించిన వివరాలను తీసుకొని సంబంధిత అధికారులతో మాట్లాడుతా. సమస్య నా దృష్టికి వచ్చింది. వీలైనంత త్వరగా పూర్తి చేయించేందుకు చర్యలు చేపడతా.

? ముఖ్యమంత్రి హామీ నిధులు, పట్టణ ప్రగతి కింద ప్రారంభించిన సమీకృత మార్కెట్ల పనులతోపాటు ఇతర నిర్మాణాలు నిలిచిపోయాయి. నిధుల కొరత తీవ్రంగా ఉన్నట్లు చెబుతున్నారు. ఎప్పుడు మంజూరు చేయిస్తారు.

✓ దీనిపై కార్యాచరణ ఉంది. వర్షాల కారణంగా పనులు ఆగిపోయాయి. నిధులు విడుదల చేయించే పనిలో ఉన్నాను. అన్ని పనులు పూర్తి చేయించడమే కాకుండా నిలిచిన బిల్లులు కూడా మంజూరు చేయిస్తా.

? ఉమ్మడి జిల్లా కేంద్రంలోని రవాణా శాఖ కార్యాలయంలో ఉన్న డ్రైవింగ్ పరీక్షకు సంబంధించి ట్రాక్ నిర్మాణ పనులు మధ్యలో ఆగిపోయాయి. పరీక్ష నిర్వహించడానికి ఇబ్బందులు పడుతున్నారు.

✓ ట్రాక్ పనులు మూడు నెలల్లో పూర్తి చేయిస్తా. త్వరలో అధునాతన విధానం అమల్లోకి తెస్తున్నాం. కరీంనగర్ రవాణా కార్యాలయాన్ని సందర్శించి సమీక్ష జరిపి సౌకర్యాలు కల్పిస్తాం.

? సిరిసిల్ల, జగిత్యాల, పెద్దపల్లి జిల్లాల్లో రవాణా శాఖ కార్యాలయాలు అద్దె భవనంలో ఉన్నాయి. డ్రైవింగ్ పరీక్షల ట్రాక్‌లు లేవు. ఎప్పటిలోగా సౌకర్యాలు కల్పిస్తారు.

✓ కొత్త జిల్లాలో సొంత భవనాలు నిర్మించాలని రవాణాశాఖ నిర్ణయం తీసుకుంది. ఇటీవల శాఖాపరంగా నిర్వహించిన సమీక్షలో కూడా చర్చించాం.

? జిల్లా పరిధిలోని మానకొండూర్, చొప్పదండి నియోజకవర్గ కేంద్రాల్లో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను వైద్య విధాన పరిషత్ పరిధిలోకి మార్చాలని గత ప్రభుత్వం నిర్ణయించింది? ఇంకా అమలుకు నోచుకోవడం లేదు

✓ అన్ని నియోజకవర్గాల్లోని ప్రధాన పట్టణాల్లో వైద్యపరంగా సౌకర్యాలు కల్పించేలా ముందుకు వెళ్తాం. వైద్య విధాన పరిషత్ పరిధిలోకి వాటిని తీసుకొచ్చి సేవలు విస్తరిస్తాం.

? బీసీ సంక్షేమశాఖ ద్వారా రుణాల మంజూరు నిలిచిపోయింది. నిరుద్యోగులు, చిన్న వ్యాపారులు ఉపాధి పనులు చేసుకోలేకపోతున్నారు. రాయితీ రుణాలు ఇచ్చే అవకాశముందా

✓ బలహీన వర్గాల సంక్షేమం కోసం కొత్త కార్పొరేషన్లు కూడా ఏర్పాటు చేశాం. రుణాల మంజూరు వంటి అంశాలను సమీక్షించి తగు నిర్ణయాలు తీసుకుంటాం.

దృష్టి సారిస్తున్నారా!

పిల్లల్లో పెరుగుతున్న కంటి సమస్యలు ■ ఆర్బీఎస్కే పరీక్షల్లో వెల్లడి

బుజ్జాయి అన్నం తినని మారాం చేస్తే అమ్మకు గుర్తొచ్చే సాధనం ఫోన్.. అబ్బాయి అల్లరి చేస్తుంటే టీవీ పెట్టేస్తాడు నాన్న.. ఆ తర్వాత పిల్లలు బడి నుంచి రాగానే పుస్తకాలు పక్కన పడేసి ఫోన్లలో మునిగిపోతుంటారు.. హోంవర్క్ చేసుకోకుండా టీవీ చూస్తూ గడుపుతుంటారు.. పిల్లలను బుజ్జగించడానికి తల్లిదండ్రులు చేస్తున్న అలవాటు ముమ్ముందు వారికి ఇబ్బందులు తెచ్చిపెడుతోంది..

న్యూస్‌టుడే, పెద్దపల్లి కలెక్టరేట్

భావి పౌరుల్లో కంటి సమస్యలు పెరుగుతున్నట్లు రాష్ట్రీయ బాల స్వస్థ్య కార్యక్రమ(ఆర్బీఎస్కే) నివేదికలు వెల్లడిస్తున్నాయి. పాఠశాలల విద్యార్థుల్లో దృష్టి లోపాన్ని గుర్తించిన ప్రభుత్వం కంటి పరీక్ష శిబిరాలు నిర్వహిస్తోంది. ప్రస్తుత విద్యా సంవత్సరం ముగిసేలోగా ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులందరికీ వైద్య పరీక్షలు జరపాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో భాగంగా ఆర్బీఎస్కే ఆధ్వర్యంలో బడుల్లో శిబిరాలు నిర్వహిస్తున్నారు. ప్రతి విద్యార్థినీ పరీక్షించి కంటి సంబంధిత సమస్యలున్నాయా? దృష్టి లోపంతో బాధ పడుతున్నారా? శస్త్రచికిత్స అవసరం ఉందా? అని ఆప్తమాలజీ ఇన్‌స్ట్రక్టర్లు నిర్ధారిస్తున్నారు. అవసరమైన వారికి అద్దాలు పంపిణీ చేస్తున్నారు. ఇందులో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 23 మంది భాగస్వాములున్నారు. మొత్తం 1,14,479 మంది విద్యార్థులకు గాను ఇప్పటివరకు 46,954 మందిని పరీక్షించారు. వీరిలో 2,527 మందికి అద్దాలు అవసరమని గుర్తించగా, 141 మందిని శస్త్ర చికిత్సలకు సిపార్సు చేశారు.

ఉమ్మడి జిల్లాలో కంటి పరీక్షల వివరాలు

	విద్యార్థులు	పరీక్షించింది	దృష్టి లోపం	శస్త్రచికిత్స అవసరం
పెద్దపల్లి	26,780	11,591	563	44
జగిత్యాల	32,548	12,848	633	16
కరీంనగర్	31,541	10,753	593	26
సిరిసిల్ల	23,610	11,762	738	55

తల్లిదండ్రులు గమనిస్తుండాలి

■ ఎక్కువసేపు టీవీలు, స్మార్ట్‌ఫోన్లు, కంప్యూటర్లను చూస్తే కళ్లు పొడిబారి దృష్టి సమస్య వస్తుంది.

■ పిల్లలు ఖాళీ సమయంలో టీవీలకు, ఫోన్లకు అతుక్కుపోకుండా ఆరుబయట ఆడుకునేలా ప్రోత్సహించాలి.

■ చదివే సమయంలో పుస్తకాలను దగ్గరగా పెట్టుకోకుండా కంటికి కనీసం 30 సెం.మీ.ల దూరంలో ఉండేలా చూడాలి.

మూడు, ఆరేళ్లలో పరీక్షలు

బాల్యంలోనే కంటి సమస్యలను గుర్తిస్తే భవిష్యత్తులో ఇబ్బందులుండవు. మూడేళ్ల వయసులో కంటి వైద్య పరీక్ష చేస్తే బొమ్మలను గుర్తు పడుతున్నారా? అనేది తేలుతుంది. తిరిగి ఆరేళ్ల వయసులో పరీక్షించాలి. దృష్టి లోపం ఉంటే అద్దాలు, ఇతర సంరక్షణ చర్యలు తీసుకోవాలి.

పెద్దపల్లిలో కంటి పరీక్ష చేస్తున్న నేత్ర సహాయకుడు

అక్షరాలు చిన్నగా కనిపిస్తున్నాయి

పుస్తకాలు, బోర్డుపై అక్షరాలు చిన్నగా కనిపిస్తున్నాయి. మా పాఠశాలలో కంటి పరీక్ష చేసుకున్నా. కొద్దిగా సమస్య ఉన్నట్లు తేలింది. అద్దాలు అవసరమని చెప్పారు.

– లలిత, 9వ తరగతి, పెద్దపల్లి జడ్పీ బాలుర పాఠశాల

ప్రతి విద్యార్థినీ పరీక్షిస్తున్నాం

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతి విద్యార్థికీ కంటి పరీక్షలు నిర్వహిస్తున్నాం. దృష్టి లోపాలను గుర్తిస్తూ, అద్దాల పంపిణీకి నివేదిస్తున్నాం. సమస్య అధికంగా ఉంటే ప్రభుత్వ ఆసుపత్రుల్లో శస్త్రచికిత్స చేస్తాం.

– డా.కిరణ్, ఆర్బీఎస్కే, పెద్దపల్లి జిల్లా నోడల్ అధికారి

స్వీయ రక్షణే ప్రధానం

పిల్లలు ఎక్కువ సమయం సెల్‌ఫోన్, కంప్యూటరు, టీవీ చూస్తే చూపు మందగిస్తుంది. తదేకంగా చూస్తూ ఉంటే కళ్లలో తడి ఆరిపోతుంది. నిరంతరాయంగా మూడు గంటల కంటే ఎక్కువ సేపు చూడొద్దు. కళ్లకు సంబంధించి వ్యాయామం అలవాటు చేసుకుంటే కొంతవరకు సమస్య రాకుండా చూసుకోవచ్చు. ఏ విటమిన్ కలిగిన ఆకుకూరలు, క్యారట్, కోడిగుడ్డు తరచూ ఇస్తుండాలి.

– డా.వేణుమాధవ్, ఆప్తమాలజీ అసోసియేట్ ప్రొఫెసర్, రామగుండం వైద్య కళాశాల

ఎందుకీ పరిస్థితి!

■ కరోనా సమయంలో ఆన్‌లైన్ తరగతులు నిర్వహించడంతో పిల్లలు ఎక్కువ సమయం తెరలకు అంటుకుపోయి కంటి చూపుపై ప్రభావం పడింది.

■ ప్రైవేటు పాఠశాలల నిర్వాహకులు ఆన్‌లైన్ హోంవర్క్ ఇస్తుండటంతో ఫోన్ వాడకం పెరిగింది.

■ ఇటీవలి కాలంలో పిల్లలు ఎక్కువ సేపు టీవీలు, ఫోన్లకు అతుక్కుపోతున్నారు.

పెరుగుతున్న మానసిక సమస్యలు

విద్యార్థులు ఎక్కువ సమయం ఫోన్లు వాడుతుండటంతో దృష్టి లోపంతో పాటు మానసిక సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఒత్తిడికి గురై ప్రతి చిన్న విషయానికీ చిరాకు పడుతున్నారు. ఆకలి మందగించడంతో పాటు ఏకాగ్రత, ఆలోచనా శక్తి కోల్పోతున్నారు. బరువు పెరగడంతో పాటు ఎదుగుదల క్షీణిస్తోంది. తల నొప్పితో బాధ పడుతున్నారు. అయిదేళ్లలోపు పిల్లలకు ఎలక్ట్రానిక్ ఉపకరణాలు ఇస్తుండటంతో కంటి సమస్యలు ఎక్కువగా వస్తున్నాయని వైద్య నిపుణులు చెబుతున్నారు.

అ ఆ ■ తరగతి గదుల్లో నల్లబల్లపై అక్షరాలు, పుస్తకాల్లో చిన్న అక్షరాలు కనిపించం లేదు.

■ పౌష్టికాహారం, జన్యు లోపాలతోనూ కొందరిలో కంటి చూపు సమస్య తలెత్తుతోంది.

కలగన్నారు.. ఖాకీ ధరించారు

న్యూస్‌టుడే, కమాన్‌పూర్ (సెంటినరీకాలనీ)

పోలీస్ యూనిఫాం ధరించాలనేది వారి కల.. కష్టాలకు ఎదురీది దాన్ని నిజం చేసుకున్నారు. వంటింటికి పరిమితమయ్యే ఆడపిల్లలకు చదువెందుకు అనేది చాలా మంది భావన. కానీ పరిస్థితులు మారాయి. ఇంత చదివి కుటుంబ బాధ్యతలకే పరిమితం కావాలా అని ఆలోచించే అమ్మాయిలూ ఎక్కువవుతున్నారు. సమాజ బాధ్యతలో మేము భాగమే అని పోటీపడి ఉద్యోగాలు సాధిస్తున్నారు. సంకల్పం, పట్టుదల ఉండాలనే కానీ పేదరికం, ఆర్థిక ఇబ్బందులు అడ్డుకాదని పెద్దపల్లి జిల్లా యువతులు నిరూపించారు. జిల్లాకు చెందిన పలువురు యువతులు ఎస్సై ఉద్యోగాలు సాధించి ఆదర్శంగా నిలుస్తున్నారు. 2022లో పోలీసు ఉద్యోగాలకు సంబంధించి నోటిఫికేషన్ రాగా.. సాధించి ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్నారు.

ట్యూషన్ చెబుతూ..

నా పేరు అమూల్య గైక్వాడ్. మాది పెద్దపల్లి జిల్లా గోదావరిఖని. తండ్రి బీందాస్, తల్లి రాజేశ్వరి. తండ్రికి కంటిచూపు లేకపోవడతో అమ్మనైనే కుటుంబ భారం పడింది. ఏరియా ఆసుపత్రిలో పారిశుద్ధ్య కార్మికురాలిగా పనిచేస్తూ.. నన్ను మా తమ్ముడిని చదివించింది. నేను చిన్నప్పటి నుంచి ప్రభుత్వ పాఠశాలలో చదివా. డిప్లొమా చేసి రంగారెడ్డి జిల్లాలో 2020లో బీటెక్ పూర్తి చేశా. కొవిడ్‌తో కొద్ది నెలలు ఇంటి వద్దే ఉన్నా. తర్వాత పోలీస్ నోటిఫికేషన్ రావడంతో హైదరాబాద్ వెళ్లి ప్రిలిమ్స్, ఈవెంట్స్, మెయిన్స్‌కు సన్నద్ధమయ్యా. ఆర్థిక పరిస్థితుల కారణంగా రూ.4వేలకు ట్యూషన్ చెప్పా. అమ్మ పంపించే నగదు.. ట్యూషన్ డబ్బులతో రెండేళ్లు అక్కడే ఉండి ఉద్యోగం సాధించా. ఉద్యోగం సాధించాలనే పట్టుదలతో రోజుకు 18 గంటలు శ్రమించా. మహిళాసాధికారత కోసం కృషి చేస్తా. ప్రస్తుతం జయశంకర్ భూపాలపల్లి జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ ఠాణాలో ప్రొబేషనల్ ఎస్సైగా విధులు నిర్వహిస్తున్నా.

యూనిఫాంపై మక్కువతో..

నా పేరు సకపురం దివ్య. మాది పెద్దపల్లి జిల్లా గోదావరిఖని. తండ్రి శ్రీనివాస్ సింగరేణి కార్మికుడు. తల్లి రమాదేవి గృహిణి. నేను 2021లో ఎంటెక్ పూర్తిచేసి పోలీస్ ఉద్యోగానికి సన్నద్ధమయ్యా. ఇతర పోటీ పరీక్షలు కూడా రాయడంతో సింగరేణి జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం సైతం సాధించా. యూనిఫాం ఉద్యోగంపై ఉన్న మక్కువతో వెళ్లలేదు. ఇంటివద్దనే ఉంటూ సొంతంగా సన్నద్ధమయ్యా. నిత్యం మైదానానికి వెళ్లి రన్నింగ్, లాంగ్ జంప్ వంటివి సాధన చేశా. సమాజంలో మహిళలపై జరుగుతున్న వేధింపులను అరికట్టేందుకు కృషి చేసే అవకాశం వచ్చింది. ప్రస్తుతం జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ ఠాణాలో ప్రొబేషనల్ ఎస్సైగా విధులు నిర్వహిస్తున్నా.

భర్త ప్రోత్సాహంతో..

నా పేరు ఎల్లూరి రవళిరెడ్డి. మాది పెద్దపల్లి జిల్లా గోదావరిఖని. తండ్రి లింగారెడ్డి చిరు వ్యాపారి. తల్లి వసంత గృహిణి. తండ్రి 2017లో చనిపోయాడు. మేము నలుగురం సోదరీమణులం. నాన్న చనిపోవడంతో అమ్మ మమ్మల్ని చదివించింది. నా బీటెక్ 2017లో పూర్తి కావడంతో శ్రీధర్‌రెడ్డితో పెళ్లి అయింది. నా భర్త హైదరాబాద్‌లో ప్రైవేట్ ఉద్యోగం, నేను సాఫ్ట్‌వేర్ ఉద్యోగంలో చేరాం. మూడేళ్లు ఉద్యోగం చేశా. తర్వాత పాప పుట్టడంతో ఇంటి వద్దనే ఉన్నా. 2022లో పోలీస్ నోటిఫికేషన్ రావడంతో.. నా భర్త ప్రోత్సహించారు. సొంతంగా పరీక్షలకు సిద్ధమయ్యాను. పాపను చూసుకుంటూ సన్నద్ధమవడం కష్టంగా మారడంతో అత్తమామలు బాధ్యత తీసుకున్నారు. మహిళల రక్షణకు నావంతు కృషి చేస్తా. ప్రస్తుతం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ఠాణాలో ప్రొబేషనల్ సివిల్ ఎస్సైగా విధులు నిర్వహిస్తున్నా.

జానపద గాయకుడిపై అత్యాచారం కేసు

జగిత్యాల, న్యూస్‌టుడే: జానపద గాయకుడు, సాంస్కృతిక సారథి ఉద్యోగి సింగారపు మల్లేశం అలియాస్ మల్లికతేజపై జగిత్యాల పట్టణ పోలీసుస్టేషన్‌లో అత్యాచారం కేసు నమోదైంది. జగిత్యాల గ్రామీణ మండలంలోని ఓ గ్రామానికి చెందిన సహచర గాయకురాలు ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసి విచారణ జరుపుతున్నట్లు ఎస్సై మన్మధరావు ఆదివారం తెలిపారు. అవకాశాల పేరుతో కరీంనగర్‌లోని స్టూడియోలో పలుమార్లు అత్యాచారం చేశాడని, పారితోషికం ఇవ్వలేదని, పెళ్లి చేసుకోవాలని వేధిస్తున్నాడని యువతి పేర్కొన్నట్లు పోలీసులు వివరించారు.

నేటి నుంచి ఓటరు నమోదు ప్రక్రియ

పట్టభద్రులు, ఉపాధ్యాయ మండలి సమరం

ఈనాడు, కరీంనగర్: మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్-కరీంనగర్ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలకు ఓటరు నమోదు ప్రక్రియ సోమవారం ప్రారంభం కానుంది. పై నాలుగు ఉమ్మడి జిల్లాల పరిధిలో ప్రస్తుతం 15 జిల్లాలున్నాయి. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలతో ఇప్పటికే కలెక్టర్లు నమోదుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ విధానాల్లో ఓటరుగా నమోదు చేసుకొనే అవకాశముంది. డిగ్రీ ఉత్తీర్ణులైన వారు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో, స్కూల్ అసిస్టెంట్, జేఎల్‌లు(జూనియర్ లెక్చరర్లు), డీఎల్‌లు(డిగ్రీ లెక్చరర్లు), యూడైస్‌లో నమోదైన ప్రైవేటు పాఠశాలల్లోని టీచర్లు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేయడానికి అవకాశం ఉంటుంది.

కొత్తగా నమోదు చేసుకోవాల్సిందే



దాదాపు అయిదేళ్ల కిందట ఈ రెండు ఎమ్మెల్సీ స్థానాలకు ఓటు వేసిన వారంతా తిరిగి కొత్తగా ఓటరుగా నమోదు చేసుకోవాలి. అప్పుడు ఓటేసినా.. వేయకున్నా ఇప్పుడు మళ్లీ కొత్త జాబితానే అధికారులు రూపొందిస్తారు. దీని ప్రకారమే త్వరలో జరిగే ఎన్నికల్లో ఓటు వేసే అవకాశాన్ని కల్పిస్తారు. 2019 మార్చిలో జరిగిన ఎన్నికలతో పోలిస్తే ఈ సారి ఓటర్ల సంఖ్య గణనీయంగా పెరిగే అవకాశముంది. గతంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోనే ఎక్కువ ఓటర్లున్నారు. జిల్లాల పరిధిలో పట్టభద్రులతో పాటు ఉపాధ్యాయు ఓటును నమోదు చేసుకోవాలి. ఫారమ్-18 ద్వారా వివరాలు నమోదు చేసి సీఈవో తెలంగాణ వెబ్‌సైట్‌లో పొందుపర్చాలి. పత్రాలను తహసీల్దార్ కార్యాలయాల్లో అందజేయాలి. 2021 నవంబరులోగా డిగ్రీ పూర్తి చేసిన వారు పట్టభద్రుల స్థానానికి ఓటు నమోదు చేసుకోవచ్చు. మరోవైపు ఈ రెండు ఎమ్మెల్సీ స్థానాలకు పోటీ చేసేవారు కూడా ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసి నమోదుకు శ్రీకారం చుడుతున్నారు.

డిసెంబరు 30న తుది జాబితా

ప్రస్తుతం ఈ స్థానం నుంచి పట్టభద్రుల ఎమ్మెల్సీగా జీవన్‌రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా కె.రఘోత్తమ్‌రెడ్డి కొనసాగుతున్నారు. వచ్చే ఏడాది మార్చి 29తో వీరి పదవీ కాలం ముగియనుంది. ఈ ఏడాది నవంబరు మొదటి వారం నాటికి కొత్త ఓటరు జాబితాను రూపొందించాలని ఎన్నికల సంఘం విధి విధానాలను జిల్లాలకు పంపించింది. సెప్టెంబరు 30 నుంచి నవంబరు 6 వరకు ఓటరు నమోదు ప్రక్రియ కొనసాగనుంది. సవరణలు, ఆక్షేపణలకు గడువు ఇచ్చి డిసెంబరు 30న తుది ఓటరు జాబితా వెల్లడించనున్నారు.

2019 జాబితా ప్రకారం..

విభాగం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
ఉపాధ్యాయ	15,892	7,322	-	23,214
పట్టభద్రులు	1,35,218	61,077	26	1,96,321

ఉప్పట్లు.. నీరందట్లే!

రెండేళ్ల కిందట వరదల్లో నీట మునిగిన ఎత్తిపోతల పథకం నేటికీ మరమ్మతుకు నోచుకోవడం లేదు. నిధుల మంజూరు.. ప్రతిపాదనలకే పరిమితం కావడంతో ఆయకట్టులో పంటల సాగు ప్రశ్నార్థకంగా మారింది. ఫలితంగా గోదావరి తలాపునే ఉన్నా ఆ రైతులకు కష్టాలు తప్పడం లేదు.

న్యూస్‌టుడే, మంథని

మంథని మండలం ఉప్పట్లలో గోదావరి తీరంలో నిర్మించిన ఎత్తిపోతల పథకం 2022 జులైలో వచ్చిన వరదలకు నీట మునిగింది. నాలుగు పంపులు దెబ్బతినడంతో పాటు విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మరు పాడయింది. మోటార్ల రాగి తీగలు, కండెన్సర్లు ఇతర సామగ్రిని దొంగలు ఎత్తుకెళ్లారు.

2013 జూన్ 9న రూ.50 కోట్ల వ్యయంతో ఈ పథకానికి శంకుస్థాపన చేశారు. 2018లో పనులు పూర్తి చేసి నీటిని విడుదల చేశారు. కుడి, ఎడమ కాలువల పైపులైన్ల లీకేజీతో తరచూ నీటి సరఫరాకు ఆటంకాలు ఏర్పడుతున్నాయి. మూడేళ్లుగా నీరు విడుదలవుతున్నా ఎప్పుడూ ఆయకట్టుకు చేరలేదు.

అయిదు గ్రామాల్లో 2 వేల ఎకరాలు

ఉప్పట్ల, గుంజపడుగు, పోతారం, విలోచవరం, నాగారం గ్రామాల్లోని 2 వేల ఎకరాలకు సాగునీటిని అందించాలనే లక్ష్యంతో ఈ పథకాన్ని ఏర్పాటు చేశారు. ఉప్పట్ల, గుంజపుగు గ్రామాలకు మాత్రమే నీరందింది. లీకేజీలు, ఛాంబర్ల వ్యవస్థ సరిగ్గా లేక పోతారం, నాగారం, విలోచవరం ఆయకట్టుకు అందడం లేదు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో పనులు అస్తవ్యస్తంగా జరిగాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రూ.3.12 కోట్లతో ప్రతిపాదించాం

పథకం మరమ్మతుల కోసం రూ.3.12 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. రాగి తీగ, ఇతర సామగ్రి చోరీకి గురి కావడంతో మళ్లీ అంచనాలు రూపొందించి ప్రతిపాదిస్తున్నాం. నిధులు మంజూరైతే యుద్ధప్రాతిపదికన పనులు చేపడతాం. పూడికతీత, విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మరు ఏర్పాటు, ప్రహరీ, ఎలక్ట్రానిక్, మెకానికల్ పంపుల మరమ్మతుకు ప్రతిపాదించాం. ఉప్పట్ల భూములకు కాలువ నీరందించేలా చర్యలు తీసుకుంటున్నాం.

– బలరామయ్య, నీటి పారుదల శాఖ ఈఈ

తండ్రిని హత్య చేసిన కొడుకు

పిన తల్లిపైనా దాడి

వేములవాడ, న్యూస్‌టుడే: ఆస్తి తగాదాల విషయంలో కుమారుడు తండ్రిని హత్య చేసిన సంఘటన ఆదివారం వేములవాడ పట్టణంలోని చెక్కపల్లి రోడ్డులో చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... పట్టణానికి చెందిన మామిండ్ల మల్లయ్య (65) మొదటి భార్య బాలవ్వకు కుమారుడు రాజు, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. దాదాపు 12 ఏళ్ల క్రితం బాలవ్వ దొంగల చేతిలో హత్యకు గురైంది. తరవాత పద్మను రెండో వివాహం చేసుకున్నాడు. ఆమెకు ఒక కుమారుడు, ఇద్దరు బిడ్డలు ఉన్నారు. మల్లయ్యకు రూ.కోట్ల విలువ చేసే ఆస్తున్నాయి. గత కొంత కాలంగా ఆస్తుల పంచి ఇవ్వాలని మొదటి భార్య కుమారుడు రాజు తండ్రి మల్లయ్యను కోరుతున్నాడు. ఆదివారం ఈ క్రమంలో కుల సంఘం వద్ద పెద్దల సమక్షంలో ఆస్తుల విషయమై మాట్లాడుకున్నారు. అయితే అందరికీ వివాహాలు అయ్యేవరకు ఆస్తులు పంచేది లేదని మల్లయ్య చెప్పి ఇంటికి వెళ్లిపోయాడు. దీంతో పగ పెంచుకున్న కుమారుడు రాజు, మరో ఇద్దరు బంధువులు కలిసి అతని ఇంటికి వెళ్లి ముందుగా మల్లయ్య రెండో భార్య పద్మపై కత్తితో దాడి చేశారు. దీంతో ఆమె తలపై తీవ్ర గాయాలై కిందపడిపోగా అడ్డుకునేందుకు వచ్చిన మల్లయ్యపై కత్తితో దాడి చేశారు. దీంతో అతనికి కూడా తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే 108 వాహనంలో వేములవాడలోని ఏరియా ఆసుపత్రికి తరలించగా మల్లయ్య మృతి చెందాడు. పద్మను మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌లోని ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని పట్టణ ఇన్‌ఛార్జి సీఐ శ్రీనివాస్, ఎస్సైలు రమేశ్, మారుతి పరిశీలించి వివరాలు సేకరించారు. డాగ్ స్క్వాడ్‌తో సంఘటన స్థలాన్ని తనిఖీ చేశారు. మృతుని బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, నిందితులను త్వరలో పట్టుకుంటామని సీఐ శ్రీనివాస్ తెలిపారు.

మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు

మల్లయ్య

చెరువులో మునిగి యువకుడి మృతి

నరేందర్

చిగురుమామిడి, న్యూస్‌టుడే: స్నేహితులతో సరదాగా చెరువులోకి వెళ్లిన యువకుడు నీట మునిగి మృతి చెందిన ఘటన ఆదివారం రాత్రి చిన్న ముల్కనూర్‌లో విషాదం నింపింది. గ్రామస్థుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన అయిదుగురు స్నేహితులు స్థానిక చెరువు వద్దకు వెళ్లారు. తెప్ప మీద కూర్చొని చెరువులోకి వెళ్లారు. ఒక్కసారిగా తెప్ప బోల్తా పడటంతో ఈతరాని నరేందర్ (18) నీట మునిగాడు. పక్కనే ఉన్న ఓ జాలరు నరేందర్‌ను ఒడ్డుకు చేర్చి చికిత్స కోసం కరీంనగర్ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఘటనపై ఫిర్యాదు అందలేదని ఎస్సై రాజేశ్ పేర్కొన్నారు.

EENADU eClassifieds

BUSINESS SERVICES

SAREES

మావద్ద కంచి, ఆరణి, ధర్మవరం, ఉప్పాడ, వెంకటగిరి, గద్వాల్, పోచంపల్లి, నారాయణపేట, అన్ని రకముల పట్టు వీరలు & బెనారస్, కలకత్తా, సూరత్ ప్యాన్సీ చీరలు హోల్‌సేల్‌గా లభించును. Hyd, మియాపూర్ ఆల్విన్ కాలనీ. 7396099834.

REAL ESTATE

FLAT FOR SALE

Flat No. 501, 2 BHK, Veera Residency, Near KES Garden, Laxminagar, Kaman, Karimnagar. Contact: M.Rajanikanth, Cell: 95500 02255.

HOUSE FOR SALE

KNR, అల్గునూర్, SR కాలేజ్ సమీపంలో పుష్పల బాంకెట్ హాల్ మరియు గెస్ట్ హౌస్ & అల్గునూర్ చౌరస్తా సమీపంలో 450 గజాలలో G+1 బిల్డింగ్ 6000 Sft అమ్మబడును. పుష్పల మీనయ్య. సెల్: 78932 50325.

LAND FOR SALE

16 Guntas Land Highway Road RK Colony Karimnagar with House and Borewell. Contact. Cell: 9848043704, 7780646886.

PLOT FOR SALE

తిమ్మాపూర్ సబ్‌రిజిస్ట్రార్ ఆఫీస్ - శ్రీ చైతన్య కాలేజీ ఎదురుగా రాజీవ్ హైవే పక్కన 2వ N/W ప్లాట్ అమ్మబడును. 223 చ.గ. హాస్టల్స్/ పట్టభద్రుల అనుకూలం. 90301 37781.

వేములవాడ టౌన్‌లో విశ్వబ్రాహ్మణ వీధి నందు H.No. 5-3-128 (5-2-40) 4-58 చదరపు గజముల (3.79 గుంటల) స్థలము చిన్న గదితో సహా అమ్మబడును. ఆసక్తి గలవారు Cell: 99897 07699.

KNR, తీగల బ్రిడ్జి సమీపంలో, 3 అంతస్తుల బిల్డింగ్ ప్రక్కన, 5 గుంటలు లేదా 25 గుంటలు, 30' రోడ్ ప్లాట్ అమ్మబడును. పుష్పల మీనయ్య. 78932 50325.

JOBS

Suitable B.Sc. Diploma Agriculture and B.Sc. Diploma Horticulture Graduates in Oil Palm Plantation Project in Peddapally District. Salary as per the industry standards for deserving candidates. Cont: 63801 92014.

త్రివేణి హాంకేర్ హైదరాబాద్ నందు మృదులను/ షేపబ్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం, జీతం 18k. Cell: 91609 00024, 96404 00073.

లక్ష్మీ గార్మెంట్స్‌లో పనిచేయుటకు Male/Female వర్కర్స్ (పురుషులు / స్త్రీలు) Age 30 సం.లోపు కావలెను. సంప్ర: ఆశోక్‌నగర్, కరీంనగర్. సెల్: 85559 98915.

కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్లని చూసుకోవడానికి స్త్రీ/పు॥ ఆయా, నర్సులు, వంటవారు, RMP & డాక్టర్స్ కావలెను. వీ॥ 15-40 వేలు. ఫ్రీ రూమ్ + బో॥ Hyd. 9182260297.

ఇండియన్ మెడికల్ ఏజెన్సీ, కరీంనగర్ IB చౌరస్తాలో పనిచేయుటకు అనుభవంగల అకౌంటెంట్స్, కుప్యూటర్

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 4 PM)

గోదావరిఖని : 80085 73573

పెద్దపల్లి : 80085 73542

మంథని : 99122 68471

న్యూస్‌టుడే, గోదావరిఖని పట్టణం

? నగరపాలక పరిధి అన్నపూర్ణ కాలనీ రెండో గల్లీలో విద్యుత్తు స్తంభాలకు దీపాలు బిగించలేదు. దీంతో అంధకారం నెలకొంది. పాముల బెడద ఉన్నందున దీపాలు బిగించాలి. - ఘని, అన్నపూర్ణ కాలనీ

✔ సామగ్రిని కొనుగోలు చేస్తున్నాం. నాలుగైదు రోజుల్లో ఆయా విద్యుత్తు స్థంభాలకు దీపాలు బిగించేలా చర్యలు తీసుకుంటాం.

- రాంజీ, నగరపాలక ఏఈ(విద్యుత్తు విభాగం)

పొంచి ఉన్న ప్రమాదం

కమాన్‌పూర్ నుంచి పెంచికల్‌పేట వెళ్లేదారిలో కల్వర్టు ఉంది. దానికి సమీపంలో ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డుపై రంధ్రం ఏర్పడింది. గోదావరిఖనికి వెళ్లే ప్రధాన మార్గం కావడంతో ద్విచక్రవాహనం, ఇతర వాహనాలు ఈ దారి మీదుగానే వెళ్తాయి. సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు, వాహనదారులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, కమాన్‌పూర్

బోరు ఇలా.. వినియోగం ఎలా?

ముత్తారం మండలం రంగయ్యపల్లి ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం ఆవరణంలో నిర్మించిన బోరు వృథాగా మారింది. బోరు చుట్టూ మురుగునీరు చేరి ముళ్లపొదలు దర్శనమిస్తున్నాయి. విద్యార్థులు లేకపోవడంతో పాఠశాలను మూసేశారు. బోరులో నీరున్నా అంగన్‌వాడీ కేంద్రం, గ్రామస్థులు వినియోగించుకోవడం లేదు. - న్యూస్‌టుడే, పెద్దపల్లి కలెక్టరేట్

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయరమణారావు

రైతు పక్షపాతిగా ప్రభుత్వం: ఎమ్మెల్యే

ఎలిగేడు(సుల్తానాబాద్), న్యూస్‌టుడే: ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ చేసి రాష్ట్ర ప్రభుత్వం రైతు పక్షపాతిగా నిలిచిందని ఎమ్మెల్యే విజయరమణారావు పేర్కొన్నారు. ఎలిగేడు మండలం ధూళికట్ట పీఏసీఎస్ 108వ సర్వసభ్య సమావేశం ఆదివారం అధ్యక్షుడు పుల్లూరి వేణుగోపాల్‌రావు అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఆరు గ్యారంటీ పథకాల అమలుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అబద్ధాల పునాదుల మీద పుట్టిన భారాస రుణమాఫీ చేయక, రెండు పడక గదుల ఇళ్లు ఇవ్వక, నియామకాలు చేయక రైతులు, ప్రజలు, నిరుద్యోగులను మోసగించిందని ఆరోపించారు. ఈ సీజన్ నుంచి క్వింటాలు సన్న ధాన్యానికి రూ.500 బోనస్ కూడా ఇస్తుందన్నారు. అనంతరం ధూళికట్ట చెరువు మత్తడిని పరిశీలించిన ఆయన లోలెవెల్ వంతెన నిర్మాణానికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. జూలపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ గండు సంజీవ్, సంఘం సభ్యులు, సీఈవో రవీందర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

పరిశ్రమలు నెలకొల్పాలి

పాలకుర్తి(అంతర్గాం): మండల కేంద్రంలో సీపీఎం మహాసభను పార్టీ సీనియర్ సభ్యులు పోచం అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. అంతర్గాం స్పిన్నింగ్ మిల్లు మూసివేయడంతో స్థానికులకు ఉపాధి లేకుండా పోయిందన్నారు. వెంటనే మండల కేంద్రంలో పరిశ్రమలు నెలకొల్పాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పార్టీ మండల నూతన కార్యదర్శిగా నర్సింగరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

రుణమాఫీపై కలెక్టరేట్ ముట్టడి 1న

కాల్వశ్రీరాంపూర్, న్యూస్‌టుడే: రూ.2 లక్షలలోపు రుణాలున్నా మాఫీ వర్తించని రైతులు అక్టోబర్ 1న కలెక్టరేట్‌కు తరలి రావాలని మాజీ ఎంపీపీ నూనేటి సంపత్ పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన కాల్వశ్రీరాంపూర్‌లో విలేకరులతో మాట్లాడుతూ వెంటనే రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతిపత్రం ఇవ్వనున్నట్లు తెలిపారు. సమావేశంలో ప్యాక్స్ ఛైర్మన్ గజవెల్లి పురుషోత్తం, నాయకులు బుర్ర సదానందం, కొల్లూరి రాజమల్లు, జెట్టి దేవేందర్, కుంబం రాజు తదితరులు పాల్గొన్నారు.

పురస్కారం అందజేత

ముత్తారం: తిరుపతిలో శ్రీ స్వరవాని కల్చరల్ ఆర్ట్స్ అకాడమి ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో అంతర్జాతీయ పురస్కారాన్ని ముత్తారం మండలం అడవి శ్రీరాంపూర్ గ్రామానికి చెందిన తోడేటి శశికుమార్ అందుకున్నారు.

సత్కారం పొందుతున్న శశికుమార్

గాయకుడిగా రాణిస్తున్న సందర్భంగా శశికుమార్‌కు అవార్డు దక్కడంతో పలువురు అభినందనలు తెలిపారు.

ఘనంగా పోచమ్మ తల్లి ఉత్సవాలు

జూలపల్లి, న్యూస్‌టుడే: జూలపల్లిలో ఆదివారం పోచమ్మ తల్లి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. గత వారం కట్టిన మొక్కుబడి ముడుపులను విప్పి గ్రామ పొలిమేర మట్టూ, డప్పు చప్పులతో ఆటపాటలతో తిరిగారు. అమ్మవారి ఆలయం వద్ద పట్నం వేసి మహాలక్ష్మి, భూలక్ష్మి పేర్లతో కర్ర విగ్రహాలను పునఃప్రతిష్ఠించారు. అనంతరం భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించారు. మాజీ ఉపసర్పంచి కొప్పుల మహేశ్, గ్రామస్థులు కొమ్మ ఐలయ్య, నాగరాజు, భీరయ్య, రమేష్, రవి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాల్లో పాల్గొన్న గ్రామస్థులు

సేవ చేసే అవకాశమివ్వండి

ధర్మారం, న్యూస్‌టుడే: పార్టీలకతీతంగా తాను ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో దిగుతున్నానని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత పూట్కూరి నరేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆయన ధర్మారంలో ప్రైవేటు విద్యాసంస్థల ఉపాధ్యాయులు, అధ్యాపకులు, పట్టభద్రులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. తనను గెలిపిస్తే నిస్వార్థంగా సేవ చేస్తానన్నారు. అంతకుముందు ధర్మారం ప్రధాన కూడలిలోని డా.బీఆర్.అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ధర్మారం, వెల్గటూరు మండలాల్లోని ప్రైవేటు విద్యాసంస్థల నిర్వాహకులు, ఉపాధ్యాయులు, పట్టభద్రులు పాల్గొన్నారు.

లారీ యజమానుల సమస్యలు పరిష్కరించాలి

పెద్దపల్లి, న్యూస్‌టుడే: రాష్ట్రంలో లారీ యజమానులు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని తెలంగాణ లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అంజిరెడ్డి కోరారు. ఆదివారం పెద్దపల్లి లారీ అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్క్రాప్ పాలసీ, త్రైమాసిక పన్ను విధానం, సింగిల్ పర్మిట్, స్థానిక లారీలకు బీమా సొమ్ము తగ్గింపు, 15 ఏళ్ల దాటిన వాహనాలకు ఫిట్‌నెస్ తగ్గింపు తదితర అంశాలపై నాయకులు చర్చించారు. సమస్యల పరిష్కారానికి ఐక్యంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు శ్రీనివాసరావు, దుర్గాప్రసాద్, షేక్‌అబ్దుల్‌బారి, బూత్కూరి తిరుపతి, పి. శ్రీనివాస్, జహంగీర్, అష్టల్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న అంజిరెడ్డి

దీపావళి బోనస్.. రూ.93,750

గోదావరిఖని, న్యూస్‌టుడే: బొగ్గు గని కార్మికులకు దీపావళి నజరాగా అందించనున్న మొత్తం ఎంతో ఖరారైంది. దీనిపై జాతీయ కార్మిక సంఘాలతో దిల్లీలో సమావేశమైనట్లు కొత్తగూడెం సింగరేణి ప్రధాన కార్యాలయ అధికారులు వెల్లడించారు. గత సంవత్సరం రూ.85,500 చెల్లించిన బోనస్‌కు అదనంగా ఈ ఏడాది మరో రూ.8,250 పెంచారు. మొత్తం రూ.93,750 వేలుగా బోనస్ నిర్ణయించారు. దేశవ్యాప్తంగా కోలిండియాలో పనిచేస్తున్న 2.5 కోట్ల మందితో పాటు సింగరేణిలోని 42 వేల మంది కార్మికులకు ఈ నిర్ణయంతో ఊరట దక్కింది. ఆయా తేదీలను త్వరలో ప్రకటించనున్నారు.

ఓదెల: 2004-2005 పదో తరగతి బృందం

మార్కండేయ కాలనీ: 2006-2007 బ్యాచ్ పదోతరగతి పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ఓదెల, న్యూస్‌టుడే: ఓదెల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2004-2005లో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుని ఆడి పాడారు. నాటి గురువులను ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు నతానియల్, గిరిధర్, ప్రభాకర్, వాసు, చంద్ర కిరణ్, ఉమాదేవి, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

మార్కండేయకాలనీ: గోదావరిఖని గాంధీనగర్‌లోని గీతాంజలి ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఓ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 2006-2007 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు ఒకే వేదికపై కలుసుకున్నారు. నాటి ఉపాధ్యాయులను సన్మానించారు.

మాల జిల్లా శాఖ నాయకులతో అభివాదం చేస్తున్న చెన్నూర్, వర్ధన్నపేట ఎమ్మెల్యేలు

త్వరలో మాలల భారీ బహిరంగ సభ

జ్యోతినగర్(మార్కండేయకాలనీ): జిల్లాలోని మాలలు, ఉద్యోగులు ఐకమత్యంగా ఉండాలని చెన్నూర్, వర్ధన్నపేట ఎమ్మెల్యేలు వివేక్ వెంకటస్వామి, నాగరాజులు అన్నారు. ఎన్టీపీసీలో ఆదివారం తెలంగాణ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆఫ్ మాల జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యేలు మాట్లాడుతూ.. మాలలపై కొన్నిచోట్ల దాడులు జరుగుతున్నాయన్నారు. త్వరలో హైదరాబాద్‌లో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. జిల్లా అధ్యక్షులు డానియల్, మాల సంఘం సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే సహకార సంఘం లక్ష్యం

కాల్వశ్రీరాంపూర్, న్యూస్‌టుడే: రైతుల సంక్షేమమే లక్ష్యంగా కానారం సహకార సంఘం పని చేస్తోందని ప్యాక్స్ ఛైర్మన్ గజవెల్లి పురుషోత్తం పేర్కొన్నారు. ఆదివారం నిర్వహించిన సంఘం సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంఘంలో 978 మంది రైతులు సభ్యులుగా ఉండగా, రూ.60.66 లక్షల వాటాధనం కలిగి ఉన్నారని తెలిపారు. సంఘం నుంచి రైతులకు ఎరువులు, విత్తనాలు రాయితీపై అందజేస్తున్నామని 2023-24 ఆర్థిక సంవత్సరానికి నికర లాభం రూ.27.35 లక్షలుగా ఉందన్నారు. గోదాం నిర్మాణానికి 20 గుంటల స్థలాన్ని కొనుగోలు చేశామని, సంఘం భవనం నిర్మాణానికి రూ.26 లక్షలు బ్యాంకులో నిల్వ ఉన్నాయని వివరించారు. మాజీ ఎంపీపీ సంపత్, ప్యాక్స్ వైస్ ఛైర్మన్ బీసగోని తిరుపతి, సీఈవో విజయేందర్, ప్యాక్స్ మాజీ ఛైర్మన్ కొట్టె సమ్మయ్య, మాజీ సర్పంచులు, ఎంపీటీసీ మాజీ సభ్యులు, సంఘం డైరెక్టర్లు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ప్యాక్స్ ఛైర్మన్ పురుషోత్తం

బదిలీపై వెళ్లిన ఏఈవోకు సన్మానం

కాల్వశ్రీరాంపూర్, న్యూస్‌టుడే: కానారంలో వ్యవసాయ విస్తరణాధికారిగా పని చేసిన ఎర్ర రాజు ఇటీవల బదిలీపై సుల్తానాబాద్ మండలం కనుకులకు బదిలీపై వెళ్లారు. ఆదివారం ఆయనను సన్మానించి జ్ఞాపిక అందజేశారు. ప్యాక్స్ ఛైర్మన్ గజవెల్లి పురుషోత్తం, మాజీ ఎంపీపీ నూనేటి సంపత్, నాయకులు సమ్మయ్య, బీసగోని తిరుపతి, డొంకెన మొగిలి, కొల్లూరి రాజమల్లు, తదితరులు పాల్గొన్నారు.

ఏఈవో రాజును సన్మానిస్తున్న మాజీ ఎంపీపీ, నాయకులు

బకాయిలు చెల్లించకుంటే ఆందోళన

గోదావరిఖని: సింగరేణికి రావాల్సిన బకాయిలు చెల్లించకపోతే ఆందోళన చేపడుతామని ఏఐటీయూసీ నాయకులు సీతారామయ్య అన్నారు. గోదావరిఖని భాస్కర్‌రావుభవన్‌లో ఆదివారం మాట్లాడుతూ.. సింగరేణికి రావాల్సిన రూ.33 వేల కోట్ల బకాయిలు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు చెల్లించలేదన్నారు. దీనిపై ప్రభుత్వానికి లేఖ రాశామన్నారు. నాయకులు అశోక్, ఎల్లయ్య, పోశం, శ్రీనివాస్, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

బస్ డిపోపై చిగురిస్తున్న ఆశలు

పెద్దపల్లి, న్యూస్‌టుడే: పర్యావరణ పరిరక్షణ, ఇంధనం వ్యయాన్ని తగ్గించుకోవడంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా విద్యుత్తుతో నడిచే బస్సులను ప్రవేశపెట్టేందుకు ఆర్టీసీ సమాయత్తమవుతుంది. గతంలో ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టిన విద్యుత్తు ఛార్జింగ్ బస్సుల పనితీరు బాగుండటంతో వీటి సంఖ్యను క్రమంగా పెంచేందుకు ఆర్టీసీ చర్యలు తీసుకుంటుంది. ఇందుకు అనుగుణంగా విద్యుత్తు బస్సులకు నిర్వహణకు రాష్ట్రంలో కొత్తగా బస్ డిపోలను ఏర్పాటు చేసేందుకు అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. ఈనేపథ్యంలో పెద్దపల్లిలో ఆర్టీసీ డిపో ఏర్పాటుపై ఏళ్లుగా ఎదురుచూస్తున్న ప్రజల ఆకాంక్షలను తీర్చేందుకు ఎమ్మెల్యే విజయరమణారావు ఈ అంశంపై కలెక్టర్ శ్రీహర్ష దృష్టికి తీసుకువెళ్లి చర్చించారు. అసిఫాబాద్ నుంచి హుస్నాబాద్ వరకు మెటపల్లి నుంచి భూపాలపల్లి వరకు మధ్యలో ఉన్న డిపోలన్ని పెద్దపల్లికి సమదూరంలో ఉంటాయి.

సంఘాలు కార్యవర్గాలు

పెద్దపల్లి, న్యూస్‌టుడే: పెద్దపల్లి ఐటీఐ గ్రౌండ్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కొట్టె లక్ష్మయ్య, ఉపాధ్యక్షుడిగా కుమారస్వామి, ప్రధానకార్యదర్శిగా చింతపండు రాజమల్లు, సంయుక్త కార్యదర్శిగా కృష్ణారెడ్డి, కోశాధికారిగా సతీష్ ఎన్నికయ్యారు.

● రాష్ట్రీయ హిందూ పరిషత్తు జిల్లా అధ్యక్షుడిగా చందపల్లికి చెందిన జాపతి రాజేశ్‌ను నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు మండల భూపాల్ ఒక ప్రకటనలో తెలిపారు.

ధర్మారం: మున్నూరు కాపు సంఘం మండల అధ్యక్షునిగా మల్లాపురానికి చెందిన గందం మల్లయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం ధర్మారం వ్యవసాయ మార్కెట్లో నిర్వహించిన ఎన్నికల్లో గౌరవ అధ్యక్షులుగా కొడారి హనుమాన్, గాండ్ల స్వామి, నార ప్రభాకర్, సల హాదారుగా కొత్త నర్సింహం, కార్యనిర్వాహక అధ్యక్షునిగా కొమిరిశెట్టి సత్యనారాయణ, ఉపాధ్యక్షులుగా ఆకుల రాజేందర్, రాసూరి రాజన్న, ప్రధాన కార్యదర్శిగా ఆశనవేని రాజ్‌కుమార్ తదితర కార్యవర్గం ఎన్నికైంది. మండలంలోని వివిధ గ్రామ సంఘాల ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

పెద్దపల్లిలో వాకర్స్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు

బాలుడి మృతి

పెద్దపల్లి, న్యూస్‌టుడే: పెద్దపల్లి బండారికుంటలో ఆదివారం ఓ బాలుడు ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం స్థానికంగా నివాస ముండే కరుణాకర్ కుమారుడు అనుదీప్(6) సాయంత్రం ఇంటి ఆవరణలో ఒంటరిగా ఆడుకున్నాడు. బయటి వీధిలో ఆడుకుంటున్నారని తల్లిదండ్రులు భావించారు. రాత్రి వరకు రాకపోవడంతో వీధిలోని తోటి పిల్లలను విచారించారు. అటు వైపు రాలేదని వారు చెప్పడంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు వీధులన్నీ వెతికారు. చివరికి ఇంటి ఆవరణలోని బావిలో గుర్తించి బయటకు తీసి వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే బాలుడు మృతి చెందినట్లు వైద్యులు చెప్పడంతో కన్నవారు కన్నీరుమున్నీరయ్యారు. బాలుడి తండ్రి ప్రైవేటు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ప్రమాదంపై విచారణ నిర్వహిస్తున్నట్లు ఎస్సై లక్ష్మణ్‌రావు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి...

స్వామినాయక్

ధర్మారం, న్యూస్‌టుడే: ఎర్రగుంటపల్లి వద్ద కరీంనగర్-ధర్మారం ప్రధాన రహదారిపై ఆదివారం జరిగిన ప్రమాదంలో ఇదే మండలం లంబాడితండా-కేకు చెందిన అజ్మీరా స్వామినాయక్(38) మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం లంబాడితండాకు చెందిన స్వామినాయక్, రవి కలిసి బైకుపై ధర్మారానికి వస్తుండగా ఎర్రగుంటపల్లి శివారులో ఎదురుగా వస్తున్న కారు వీరిని ఢీకొట్టింది. దీంతో ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా కరీంనగర్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ స్వామినాయక్ మృతి చెందాడు. స్వామినాయక్ సోదరుడు నర్సానాయక్ ఫిర్యాదుతో కారు డ్రైవరు ఎర్రోజు సంతోష్‌కుమార్‌పై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై జలీల్ అహ్మద్ తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

జ్యోతినగర్(మార్కండేయకాలనీ): రామగుండం కమిషనరేట్ పరిధి సంజయ్‌గాంధీనగర్‌లో పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని పెద్దపల్లి టాస్క్‌ఫోర్సు ఎస్సై, సిబ్బందితో ఆదివారం పట్టుకున్నారు. వారి నుంచి రూ.8,040 నగదు, 5 చరవాణిలు స్వాధీనం చేసుకుని ఎన్టీపీసీ ఠాణాలో అప్పగించినట్లు తెలిపారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం

ఓదెల, న్యూస్‌టుడే: ఓదెలలో ఆదివారం సదాశయ ఫౌండేషన్, ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 300 మందికి పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. ఎస్సై జి.అశోక్‌రెడ్డి పాల్గొని మాట్లాడుతూ సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నేత్ర, అవయవ, దేహ దానాలతో పాటు, రక్తదాన శిబిరాలు, పర్యావరణ పరిరక్షణకు, ఇతర సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తున్న తీరును కొనియాడారు. మాజీ సర్పంచి అకుల మహేందర్, ఫౌండేషన్ జాతీయ కార్యదర్శి మేర్గు భీష్మాచారి, అల్లం సతీష్, కోండ్ర వేణు, ఇప్పనపెల్లి వెంకటేశ్వర్లు, క్యాతం మల్లేశం, ఎల్‌వీపీ వైద్యులు సుబ్బారావు, లోకేశ్, కృష్ణ పాల్గొన్నారు.

ఓదెలలో పరీక్షలు చేస్తున్న దృశ్యం

చెన్నూర్ ఎమ్మెల్యే పరామర్శ

సుల్తానాబాద్, న్యూస్‌టుడే: సుల్తానాబాద్ పట్టణానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గజభీంకర్ నర్సోజీ కాలికి గాయమై ఇబ్బంది పడుతున్నాడు. విషయం తెలుసుకున్న చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ ఆదివారం ఆయనను పరామర్శించారు. స్థానికులు పవన్, సాయి పాల్గొన్నారు.

నర్సోజీని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే వివేక్

మహిళ భద్రతపై అవగాహన

వికృత చాటుతున్న మహిళలు

పెద్దపల్లి, న్యూస్‌టుడే: జమాతే ఇస్లామి హింద్, షీ టీం ఆధ్వర్యంలో మహిళా భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నైతికతే నిజమైన స్వేచ్ఛ అనే అంశంపై నిర్వహించిన సదస్సులో మహిళా నాయకులు దాసరి ఉష, కౌసర్, అస్మాతారన్నుం, అయోషా, షీటీం సభ్యులు హేమలత, మల్లన్న, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

నేహ

పెద్దపల్లి, న్యూస్‌టుడే: పెద్దపల్లి ట్రినిటీ జూనియర్ కళాశాలకు చెందిన తూముల నేహ రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ ఓదెలు తెలిపారు. ఇటీవల కరీంనగర్‌లో జరిగిన ఉమ్మడి జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో ప్రతిభ చాటడం ద్వారా రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు.

సంక్షిప్తం

ఖని వాసికి జాతీయ యూనిక్ అవార్డు

మార్కండేయకాలనీ: తిరుపతిలోని మహతి ఆడిటోరియంలో శ్రీస్వరవాణి, స్నేహ కల్చరల్ ఆర్ట్ అకాడమిలు సంయుక్తంగా ఆదివారం నిర్వహించిన నేషనల్ యూనిక్ అవార్డు 2024 ప్రదానోత్సవంలో.. ఖని వాసి సంతోష్‌కు నిర్వాహకులు అవార్డు ప్రదానం చేశారు. శ్రీవేంకటేశ్వరస్వామి కీర్తనలు ఆలపించి, పలు సేవలందించినందుకుగాను అందజేసినట్లు తెలిపారు.

రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

గోదావరిఖని: ఏడో డివిజన్ పవర్‌హౌస్‌కాలనీలో రూ.5 లక్షల ప్రత్యేక నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణానికి కార్పొరేటర్ రాజేశ్ భూమిపూజ చేశారు. నాయకులు శ్రీనివాస్, నజీమోద్దీన్, శంకర్, దశరథం, నరేశ్, వెంకటేశ్ తదితరులున్నారు.

పిచ్చిమొక్కల తొలగింపు

గోదావరిఖని: 8వ డివిజన్‌లో రోడ్డుకు ఇరువైపులా పెరిగిన పిచ్చి మొక్కలతో ఇబ్బందులు ఎదురుకుంటున్నామని కాలనీవాసుల వినతి మేరకు.. కాంగ్రెస్ నాయకులు స్పందించి ట్రాక్టర్‌తో చదును చేయించారు. స్వామి, ముస్తఫా, రమేశ్, శ్రీనివాస్‌లు పనులను పర్యవేక్షించారు.

20వేలు దాటిన సభ్యత్వం

ఫెర్టిలైజర్ సిటీ: జిల్లాలో ఇప్పటివరకు 20వేల బాజపా సభ్యత్వం పూర్తి చేశామని ఆ పార్టీ జిల్లా సభ్యత్వ ఇన్‌చార్జి వెంకటరమణ తెలిపారు. మరింత వేగవంతం చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

చెరువు పరిసరాల్లో పారిశుద్ధ్య పనులు

గోదావరిఖని పట్టణం, న్యూస్‌టుడే: 'స్వచ్ఛతాహీ సేవ' కార్యక్రమంలో భాగంగా రామగుండం నగరపాలిక ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక మల్కాపూర్ చెరువు పరిసరాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. ఆరోగ్య సహాయకులు సునీల్‌రాథోడ్, పారిశుద్ధ్య సహాయ పర్యవేక్షకులు రవి, శ్రీకాంత్ పనులను పర్యవేక్షించారు.

డీటీఎఫ్ కార్యవర్గం ఎన్నిక

జ్యోతినగర్(మార్కండేయకాలనీ): రామగుండం డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్(డీటీఎఫ్) మండల నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నట్లు కమిటీ పేర్కొంది. అధ్యక్షులుగా ఉమామహేశ్వర్‌రావు, ప్రధాన కార్యదర్శిగా రమేష్ తదితర కార్యవర్గం ఎన్నికైంది.

గ్రామంలో పోలీసుల తనిఖీలు

యైటింక్లయిన్‌కాలనీ: గోదావరిఖని రెండో పట్టణ పోలీసుస్టేషన్ పరిధిలోని వీర్లపల్లె గ్రామంలో ఆదివారం సీఐ ప్రసాదరావు ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. రామగుండం సీపీ శ్రీనివాస్ సూచనల మేరకు అనుమానిత వ్యక్తులను విచారించారు. గ్రామంలోకి గంజాయి, గుడుంబా వంటి ఆనవాళ్లు రాకుండా చూసుకోవాలన్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

ఉద్యోగ విరమణ సన్మానం

పాలకుర్తి: అంతర్గాం మండలం కుందనపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో పనిచేసిన ఉపాధ్యాయురాలు వాసాల కాంత ఉద్యోగ విరమణ పొందారు. మండలానికి చెందిన పలువురు ఉపాధ్యాయులు ఆదివారం సన్మానించారు.

హిందీ పఖ్వాడా ముగింపు వేడుకలు

జ్యోతినగర్(మార్కండేయకాలనీ), న్యూస్‌టుడే: మహాత్మా గాంధీ స్ఫూర్తితో ఏటా సెప్టెంబరులో హిందీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నామని ఎన్టీపీసీ ఈడీ కేదార్‌రంజన్‌పాండు అన్నారు. హిందీ పఖ్వాడా ముగింపు వేడుకలు ఎన్టీపీసీ పర్మినెంట్‌టౌన్‌షిప్‌లో ఆదివారం నిర్వహించారు. ఎన్టీపీసీ ఉద్యోగులకు బహుమతులు ప్రదానం చేశారు. ఆయా పాఠశాలల విద్యార్థులు సాంస్కృతిక, శాస్త్రీయ నృత్యాలతో అలరించారు. జీఎంలు, హెచ్‌వోడీలు, డీఎంఎస్ సీనియర్ సభ్యులు పాల్గొన్నారు.

వేదికపై నృత్యం చేస్తున్న విద్యార్థినులు

(c) eenadu